సాక్షి
సూర్యాపేట
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



చోరీల ముఠా అరెస్ట్
ప్రేమజంటలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వేధించడంతో పాటు చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేశారు. - 8లో



హామీల అమలులో విఫలం
హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. - 10లో



రేపటి నుంచి ఖోఖో పోటీలు
తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు శుక్రవారం నుంచి భువనగిరిలో ప్రారంభం కానున్నాయి. - 10లో

పేదలకు కార్పొరేట్ వైద్యం

- ప్రజల చిరకాల కోరిక తీర్చినం
- ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- కోదాడలో వందపడకల వైద్యశాలకు శంకుస్థాపన
- హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో సమీక్ష
- హాజరైన మంత్రులు ఉత్తమ్, తుమ్మల



కోదాడలో వంద పడకల వైద్యశాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, అధికారులు

కోదాడ: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కోదాడలో వంద పడకల వైద్యశాల నిర్మాణానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజనర్సింహ మాట్లాడారు. ఈ వైద్యశాల నిర్మాణానికి రూ.26కోట్లు మంజూరు చేశామని, ఏడాదిలోగా పనులు పూర్తి చేసి మళ్లీ తానే దీనిని ప్రారంభిస్తానని చెప్పారు. కోదాడ ప్రజల దశాబ్దాల కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. కోదాడ ప్రాంతం హైవే పై ఉందని ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అందుల్ల ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కోదాడ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రెండ్లకుంట లిఫ్టుకు రూ. 47 కోట్లు, శాంతినగర్ లిఫ్టుకు రూ. 5 కోట్లు మంజూరు చేసి 10 గ్రామాల ప్రజలకు,10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడానికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.

ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం

హుజూర్‌నగర్ : ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. వివిధ వార్డులు తిరిగి పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం హాస్పిటల్‌లో వివిధ ఆస్పత్రులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది తక్కువగా ఉన్నారని వాటిని భర్తీ చేయాలని, కొంత ఎక్విప్‌మెంట్‌ను కూడా సమకూర్చాలని మంత్రిని డాక్టర్లు కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాపై పేదలకు విశ్వాసం మరింత పెరిగేలా వైద్య సేవలు అందించాలని చెప్పారు. అన్ని ఆస్పత్రుల్లో డైట్, శానిటేషన్, డ్రగ్స్ కొరత లేకుండా చూడాలని ఏ ఒక్క పేషంట్ కూడా బయట మందులు కొనుగోలు చేయవద్దని చెప్పారు. సూర్యాపేటలో మెడికల్ కళాశాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందాలన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో వసతుల కల్పన, ఏరియా ఆస్పత్రిలో కావాలసిన వసతులపై ప్రతిపాదనలు సత్వరమే అందించాలని సూచించారు.

కోదాడ, హుజూర్‌నగర్‌లలో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే నలమాద పద్మావతి, వైద్య రోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణణ్, కలెక్టర్ వెంకట్రావు, జాయింట్ కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ హెగ్డే, కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ, డీఎస్పీ ప్రకాశ్, కోదాడ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, ఎర్నేని బాబు, ఈదుల కృష్ణయ్య, గరిణె కోటేశ్వరరావు, డాక్టర్ సుబ్బారావు, బుర్రా పుల్లారెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరథనాయక్, డీఎంహెచ్ఓ కోటా చలం, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి కళ్యాణ చక్రవర్తి, డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ కరణ్ కుమార్, డాక్టర్ మురళీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఎంపీపీలు గూడెపు శ్రీను, కొట్టే పద్మసైదేశ్వరరావు, గోపాల్, పి. సుజాత శ్రీనివాస్, పార్వతి కొండా నాయక్, జెడ్పీటీసీలు శాగంరెడ్డి పద్మగోవిందరెడ్డి, జగన్ నాయక్, బుజ్జి మోతీలాల్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ



హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, నాగేశ్వర్‌రావు



కోదాడలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల, కలెక్టర్ వెంకట్రావు, ఎమ్మెల్యే పద్మావతి తదితరులు

విద్యార్థుల మేధస్సుకు పదును

- నేడు జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా పాటవ పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

సూర్యాపేటటౌన్ : బాల్య దశలోనే విద్యార్థులను విజ్ఞానం వైపు మళ్లించాలన్న లక్ష్యంగా విద్యాశాఖ పయనిస్తోంది. వివిధ దశల్లో వైజ్ఞానిక మేళాలు, ప్రేరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించేందుకు సమాయత్తమైంది. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

ఏడు ఉపఅంశాలతో..

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ టెక్నాలజీ(టీఎస్‌సీఓఎస్‌టీ), ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్) సంయుక్తంగా సుస్థిరాభివృద్ధికి సైన్స్ వినియోగించడం అనే ప్రధానాంశంతో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో వ్యర్థాలను తగ్గించడం, ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం, సుస్థిరాభివృద్ధి నిచ్చే ఆహారపు అలవాట్లు పాటించడం, ఒకేసారి వినియోగించే ప్లాస్టిక్‌కు స్వస్తి, నీటి పరిరక్షణ, శక్తి నిచ్చే వనరులు కాపాడటం అనే ఏడు ఉప అంశాలు ఉంటాయి. చిత్రలేఖనం, పద్యాలు, పాటలు, వక్తృత్వ విభాగాల్లోనూ పోటీలు నిర్వహిస్తారు. ఒక విద్యార్థి ఏదైనా ఒక పోటీలో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ప్రతిభ కనబర్చి న 12 మందిని ఎంపిక చేసి ఈ నెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే పోటీలకు పంపనున్నట్టు జిల్లా సైన్స్ అధికారి దేవరాజు తెలిపారు.

నీళ్ల పోరుకు బీఆర్‌ఎస్ సిద్ధం

- 13న నల్లగొండలో సభకు గులాబీ పార్టీ సమాయత్తం
- భారీ జన సమీకరణకు రంగంలోకి దిగిన ఇన్‌చార్జులు
- సభ అనుమతి కోసం ఎస్పీకి దరఖాస్తు చేసిన నాయకులు
- కృష్ణా ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగింతకు నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడి
- నేతలతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి
- ఇక్కడి నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్న బీఆర్ఎస్



సభకు అనుమతి ఇవ్వాలని ఎస్పీ చందనా దీప్తికి దరఖాస్తు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కృష్ణా నది పరిధిలోని శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అప్పగింత అంశాన్ని లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ పోరుకు సిద్ధమైంది. నల్లగొండలో ఈ నెల 13వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కూడా నల్లగొండ వేదికగానే మొదలుపెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో మంగళవారం మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించి సభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ మూడు జిల్లాలతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను నల్లగొండ సభకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా నేతలకు సూచించారు. నల్లగొండ పట్టణం శివారు మర్రిగూడ బైపాస్‌లోని గ్రౌండ్‌లో 2 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. సభ నిర్వహించే స్థలాన్ని బుధవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఇతర నేతలు పరిశీలించారు. 50 ఎకరాలను సిద్ధం చేసేందుకు పనులను ప్రారంభించారు. సభకు హాజరయ్యే మాజీ సీఎం కేసీఆర్, అతిథులు, ఇతర ముఖ్య నేతలు కూర్చునే స్టేజీ, ఆవరణకు సంబంధించిన ఏర్పాట్లపై వారు చర్చించారు.

రంగంలోకి ఇన్‌చార్జిలు

సభ నిర్వహణ, జన సమీకరణకు కేసీఆర్ ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రాజెక్టులను కాపాడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహనలేమితో సంతకాలు చేసి కేఆర్ఎంబీకి అప్పగించిందని పేర్కొంటూ, నదీ జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడుకునేందుకు, రైతులకు జరిగే నష్టాలను వివరిస్తూ ప్రజలను పోరుబాటకు సిద్ధం చేయాలన్న అధిష్టానం సూచనలతో ఇన్‌చార్జులంతా రంగంలోకి దిగారు. మేడారం జాతర నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు అందుబాటలో లేకపోయినా, ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల్లో నియోజకవర్గానికి 30 వేల మంది చొప్పున సభకు తరలించే లక్ష్యానికి అనుగుణంగా కసరత్తు ప్రారంభించారు.

సభ అనుమతి కోసం దరఖాస్తు

13న మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఎస్పీ చందనాదీప్తిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఇతర నేతలు కలిసి దరఖాస్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని ఒప్పుకోబోమని, అప్పగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభ అనుమతి దరఖాస్తుపై బుధవారం మాత్రం ఎలాంటి నిర్ణయం వెలువడం లేదు. నిబంధన ప్రకారం.. దరఖాస్తు చేసిన 48 గంటల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం 30, 30ఏ పోలీసు యాక్టు అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసు శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది నేడో రేపో తేలనుంది.



పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలోని ఓ వీధిలో చెట్లను తొలగిస్తున్న కార్మికులు

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రాక్టికల్స్ తనిఖీ



ప్రాక్టికల్స్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు లక్ష్మయ్య

నడిగూడెం : నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీయట్ ప్రాక్టికల్స్‌ను బుధవారం జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు జి.లక్ష్మయ్య, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఈశ్వర్, నరేందర్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ ఎం.సోమయ్య, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వెంకన్న, కృష్ణ, మహేష్, నగేష్, వీరన్న ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మిషన్ భగీరథ పైపులైన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ

చివ్వెంల(సూర్యాపేట): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని డీపీఓ యాదయ్య అన్నారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని ఎర్ర సూర్యానాయక్ తండాలో మిషన్ భగీరథ నీటి సమస్యల పరిశీలించారు. వేసవి వస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ నవీన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరవిందు నారాయణ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కోదాడఅర్బన్: పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈఓ అశోక్ సూచించారు. బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, పాఠశాల రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.డీ. సలీం షరీఫ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



చిల్లేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రంగారెడ్డి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) ఇన్‌చార్జ్ చైర్మన్‌గా గంటా రంగారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత చైర్మన్ అనంత్ శ్రీనివాస్ రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ రంగారెడ్డిని ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమిస్తూ సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రంగారెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, సంఘం డైరెక్టర్లు వల్లపరెడ్డి, రమణారెడ్డి, వెంకయ్య, గంగరాజు, సైదులు, శ్రీను శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, కౌన్సిలర్ బచ్చలకూరి ప్రకాశ్ , సింగిల్ విండో మాజీ చైర్మన్లు చలసాని శ్రీనివాస్‌రావు, కొడాలి భాస్కర్‌రావు, నాయకులు రామారావు, సైదులు, సత్యనారాయణ, పాండునాయక్, వల్లపు రెడ్డి తదితరులున్నారు.

మూల్యాంకన కేంద్రం ఏర్పాటుపై నివేదిక ఇస్తాం

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్ పేపర్ మూల్యాంకన కేంద్రం ఏర్పాటుపై నివేదిక ఇస్తామని ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ యంక్యానాయక్, ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చిత్రం యాదగిరిలు తెలిపారు. ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. కళాశాల భవనం, గదులను, ఆవరణను పరిశీలించారు. కేంద్రానికి కావాల్సిన వసతులను స్థానిక కళాశాల ప్రిన్సిపల్ యాదయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారి వెంట డీఐఈఓ కృష్ణయ్య, డీఈసీ సభ్యులు రుద్రంగి రవి, లక్ష్మయ్య ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

నల్లగొండ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ నియోజవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలోని రత్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ధ్వజమెత్తారు. మహిళలపై నిరంతరం వేధింపులు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం పెద్దపీట వస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఆమె పార్టీ అధినాయకత్వాన్ని కోరారు. కార్పొరేషన్ పదవుల్లో మహిళా కాంగ్రెస్ శ్రేణులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి కో–ఆర్డినేటర్ నీలం పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుకన్య, తిరుమలప్రగడ అనురాధ, స్వప్న, నాంపల్లి భాగ్య, దుబ్బ రూప, సూరెడ్డి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షురాలిగా మమత



భానుపురి (సూర్యాపేట): తెలంగాణ కళావేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సూర్యాపేటకు చెందిన జూలూరి మమత ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు నకిరెకంటి కిరణ్ కుమార్ ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మమత మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'గృహజ్యోతి' ఇంటింటి సర్వే..

- 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుతున్నవారి గుర్తింపు
- వివరాలు సేకరిస్తున్న స్పాట్ బిల్లింగ్ ఆపరేటర్లు
- అద్దెకుంటున్న వారి వివరాలు సైతం నమోదు
- రేషన్ కార్డు, ఆధార్, సెల్ నంబర్ తప్పనిసరి



పెన్‌పహాడ్‌లో గృహజ్యోతి వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాస్



తుంగతుర్తిలో విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న స్పాట్ బిల్లింగ్ సిబ్బంది

నాగారం : గృహజ్యోతి పథకం అమలుకు అడుగులు పడుతున్నాయి. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు అర్హుల వివరాలు సేకరిస్తున్నారు. దీని కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను మంగళవారం అప్‌లోడ్ చేశారు. స్పాట్ బిల్లింగ్ ఆపరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. ఈనెల15లోగా ప్రక్రియ పూర్తి చేస్తారు.

కిరాయిదారులూ అర్హులే..

ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ఇళ్ల యజమానులతోపాటు కిరాయిదారులకూ వర్తింపజేసింది. అయితే వారు రేషన్‌కార్డు(ఫుడ్ సెక్యూరిటీకార్డు), ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌లను స్పాట్ బిల్లింగ్ సిబ్బందికి చూపించాలి. ఆ వివరాలను యంత్రంలో నమోదు చేస్తారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను విద్యుత్ సంస్థ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది. స్పాట్ బిల్లింగ్ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి మీటర్ నంబర్ నమోదు చేయగానే, స్పాట్ బిల్లింగ్ మిషన్‌లో ఇంటి యజమాని వివరాలు (ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్) కనిపిస్తాయి. ఆ వివరాలు కనిపించకుంటే కొత్తగా నమోదు చేస్తారు. రేషన్ కార్డులో ఎంతమంది ఉన్నా ఒక్క మీటర్‌కే ఉచిత విద్యుత్ వర్తిస్తుంది.

జిల్లాలో 2,57,635 మందికి లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా 3,24,194 మందికి తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. గృహ వినియోగ సర్వీసులు 3,21,459 ఉంటే వీరిలో 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడే సర్వీసులు 2,57,635 ఉన్నాయి.

మార్గదర్శకాలు వస్తేనే స్పష్టత..

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే స్పష్టత వచ్చే అవకాశముంది. ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలవుతోంది. 101 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ దాటినా పూర్తి బిల్లు చెల్లించాల్సి వస్తోంది. ధోబీ ఘాట్లు, సెలూన్లు, లాండ్రీలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలవుతుండగా 250 యూనిట్ల కంటే ఎక్కువ వినియోగిస్తే 250 యూనిట్లను మినహాయించి మిగిలిన యూనిట్లకు బిల్లులు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం అమలవుతుండగా గృహజ్యోతి కింద 200 యూనిట్లు దాటితే ఎలాంటి విధానం అమలవుతుందో స్పష్టత లేదు.

వివరాల నమోదు షురూ..

- 200 వరకు యూనిట్లు వినియోగించుకునే వినియోగదారుల వివరాలను విద్యుత్ సిబ్బంది నమోదు చేస్తున్నారు.
- ఫిబ్రవరిలో ఇప్పటికే బిల్లులు నమోదు చేసినా ఆయా వినియోగదారుల వివరాలు మళ్లీ సేకరించి యాప్‌లో ఫీడ్ చేస్తారు.
- ఒకే ఇంట్లో ఒకటికంటే ఎక్కువ మీటర్లు ఉన్నా ఒకే మీటరు ఈ పథకం కిందికి వస్తుంది. ఒక వేళ అదే ఇంట్లో ఎవరైనా అద్దెకు ఉంటే వారు వినియోగిస్తున్న యూనిట్లు కూడా నమోదు చేస్తారు.
- ఒకే ఇంట్లో రెండు మీటర్లుండి కుటుంబ సభ్యులు వేరుగా ఉండి వారికి రేషన్ కార్డులు వేర్వేరుగా ఉంటే రెండింటి వివరాలు సేకరిస్తారు.
- ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు తప్పుగా నమోదైతే రేషన్ కార్డులోని వివరాలతో సరిచూస్తారు.
- గతంలో బిల్లులు చెల్లించని ×బిల్ స్టాప్₹ సర్వీసులను పునరుద్ధరిస్తేనే నమోదు చేస్తారు.
- కొందరు మీటర్ లేకుండానే విద్యుత్ వినియోగిస్తున్నారు. అలాంటి వారు కచ్చితంగా సర్వీస్ నంబర్ పొందితేనే వివరాలు సేకరిస్తారు.

వినియోగదారులు సహకరించాలి



గృహజ్యోతి కింద వివరాలు నమోదు చేసేందుకు వచ్చే స్పాట్ బిల్లింగ్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలి. దరఖాస్తు దారులు ఆధార్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు, మొబైల్ నంబర్ వివరాలతో సిద్ధంగా ఉంటే నమోదు ప్రక్రియ సులువవుతుంది. ఈవివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

– శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డీఈఈ, సూర్యాపేట.

క్లుప్తంగా

పాడి గేదెల అపహరణ

తుర్కపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు పాడి గేదెలను అపహరించారు. తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన డొనికెన పరుశరాములు మంగళవారం సాయంత్రం తన ఐదు పాడి గేదెలను వ్యవసాయ బావి వద్ద కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పాలు పితికేందుకు బావి వద్దకు వెళ్లగా గేదెలు కనిపించలేదు. పరిసర ప్రాంతాలను వెతకగా జాడ కనిపించలేదు. దుండగులు గేదెలను అపహరించారని బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


రాకేష్

నల్లగొండ టూటౌన్ : రాజస్థాన్ రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే 38వ జాతీయ సబ్ జూనియర్ హ్యాండ్ పోటీలకు నల్లగొండ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి రాకేష్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులకు నిత్య సాధన, ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్, ఇతర ఉపాధ్యాయులు రాకేష్‌ను అభినందించారు.

రిజర్వాయర్ పనులు అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మర్రిగూడ : మర్రిగూడ మండలంలో నిర్మిస్తున్న శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తమకు పూర్తి స్థాయిలో పరిహారం అందించలేదని బుధవారం రాంరెడ్డిపల్లి భూనిర్వాసితులు చర్లగూడెం వద్ద మట్టి తరలింపు పనులను అడ్డుకున్నారు. తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి మట్టిని తరలించాలని డిమాండ్ చేశారు. భూమికి పరిహారం అందించిన అనంతరం పనులు చేసుకునేందుకు పూర్తి హక్కులు ప్రభుత్వానికి ఉంటాయని డీఈ ఖాసీం వివరణ ఇచ్చారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- ప్రేమ జంటలు సఖ్యతగా ఉన్న సమయంలో సెల్‌లో చిత్రీకరణ
- ఆపై వారిని బెదిరించి నగదు, ఆభరణాలు దోపిడీ
- నిందితుల నుంచి సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: ప్రేమజంటలు సన్నిహితంగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌లో రహస్యంగా చిత్రీకరించి వేధించడంతో పాటు దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి నిందితుల అకృత్యాలు వివరించారు. నల్లగొండ పట్టణ శివారు అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిలోని నంద్యాల నర్సింహారెడ్డి కాలనీలో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన కుంచం చందు, కుంచం ప్రశాంత్, కుంచం రాజు, తిప్పర్తి మండలం కొత్తగూడెం చింతా నాగరాజు, రామ్‌నగర్‌కు చెందిన అన్నెపూరి లక్ష్మణ్, శివరాత్రి ముఖేష్‌తో పాటు ఓ మైనర్ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా సెంట్రింగ్, డ్రైవర్, మెకానిక్, కూలీలుగా పనిచేస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు ఈ ముఠా సభ్యులు కొంతకాలంగా తమ కాలనీ శివారులోని నిర్మానుష్య ప్రదేశాల్లో ప్రేమ జంటలు, వివాహితలు సఖ్యతగా ఉన్న సమయంలో రహస్యంగా వీడియోలు తీసి బెదిరించి వారిని లైంగికంగా వేధించారు. వారి వద్ద నుంచి నగదు, ఆభరణాలను దోచుకున్నారు. గత డిసెంబర్ నెలలో నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిలో వెళ్తున్న దంపతులను తమ కాలనీ వద్ద అడ్డగించి బంగారు ఉంగరం, రూ. 500 నగదు దోపిడీ చేశారు. గొల్లగూడ శివారులోని దత్తాత్రేయ వెంచర్‌లో గెస్ట్ హౌస్ తాళం పగులగొట్టి అందులో ఉన్న రెండు టీవీలు, డ్రిల్లింగ్ మిషన్ మూడు ఫ్యాన్లు, ఇన్వర్టర్, హోం థియేటర్, గ్యాస్ స్టౌవ్‌లను చోరీ చేశారు. ఫిబ్రవరి నెలలో ఓ యువకుడు, యువతి కారులో వచ్చి వీరి కాలనీ సమీపంలో రోడ్డు వెంట చెట్టు కింద భోజనం చేస్తుండగా బెదిరించి వారి సెల్ ఫోన్లు, నగదు దోచుకెళ్లారు. వన్ టౌన్ పరిధిలో ఓ బైక్‌ను కూడా అపహరించారని సొత్తును పూర్తిగా రికవరీ చేసినట్లు ఎస్పీ వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను వారి నివాసాల్లోనే అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించారని తెలిపారు. ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితుల వివరాలు రహస్యంగా ఉంచుతామని తెలిపారు.


నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

శాంతి భద్రతల కోసమే పోలీసు యాక్టు

శాంతి భద్రతల కోసమే పోలీసు యాక్టు అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యంతో పోలీసు యాక్టు అమలు చేయడం లేదని, అవసరమైనప్పుడు 30, 30ఏ పోలీసు యాక్టు 1861 అమలు చేస్తుంటారని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీనారాయణ, టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, ఐడీ పార్టీ సిబ్బంది శంకర్, బాలకోటి, శంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : నలుగురు గంజాయి విక్రేతలను బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన గాజుల రాజు, గాజుల వంశీ, దుర్గానగర్‌కు చెందిన కన్నెబోయిన జ్ఞానేశ్వర్, మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు చెందిన సాయి శ్రీరామ్‌లు జులాయిగా తిరుగుతూ ఓ ముఠాగా ఏర్పడ్డారు. తమ అవసరాలకు సులువుగా డబ్బు సంపాదించాలని గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా నలుగురు యువకులు రెండు బైక్‌లపై బుధవారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ బిహార్‌కు చెందిన వ్యక్తి వద్ద తక్కువ ధరకు 25గ్రాముల చొప్పున తక్కువ ధరకు రెండు గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేశారు. ఖరీదు చేసిన గంజాయి ఎక్కువ ధరకు విక్రయించేందుకు మిర్యాలగూడ పట్టణం వైపు వస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ సతీష్ వర్మ తన సిబ్బందితో వెంకటాద్రిపాలెం శివారులో మాటు వేసి రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు యువకులను పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. బైక్‌లతో సహా గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని యువకులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

కర్రలతో యువకుడిపై దాడి

- మిర్యాలగూడలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్


గణేశ్‌పై దాడి చేస్తున్న యువకులు

మిర్యాలగూడ అర్బన్: కొందరు వ్యక్తులు ఓ యువకుడిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. మిర్యాలగూడలో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కొమ్ము గణేశ్ ఈ నెల 4వ తేదీన సాయంత్రం 5గంటల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురు వీధిలో ఉండగా కొందరు వ్యక్తులు వచ్చి కర్రలతో అతడిపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి దాడి ఘటనను సెల్‌లో చిత్రీకరించాడు. అది గమనించిన నలుగురు వ్యక్తులు అతడి సెల్‌ఫోన్ లాక్కొని పగులగొట్టారు. అనంతరం అతడిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన గణేశ్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. గంజాయి మత్తులోనే యువకులు దాడికి తెగబడినట్లు తెలుస్తోంది. దాడి దృశ్యాలను చిత్రీకరించిన వ్యక్తి తన సెల్‌ను రిపేర్ చేయించి వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఆ వీడియో ఆధారంగా దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్ర గాయాలు
- బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో దుర్ఘటన


ఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మునగాల మండలం తాడువాయి శివారు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలం హేమ్లాతండాకు చెందిన పాంగోతు శ్రీను(45) తన భార్య మంతితో కలిసి అత్తగారి ఊరైన సూర్యాపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో తాడువాయి శివారుకు రాగానే వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన మంతిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో కళాశాల చైర్మన్ మృతి

చిలుకూరు: చిలుకూరు మండల పరిధిలోని అక్షర పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ కైలాసపు రామనాథం (63) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. మండల కేంద్రంలోని స్వగృహంలోనే ఆకస్మికంగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి కళాశాల వైస్ చైర్మన్ గంగిరెడ్డి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు, అధ్యాపకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆంధ్రా మత్స్యకారులపై పోలీసులకు ఫిర్యాదు


ఎస్‌ఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న తెలంగాణ మత్స్యకారుల సంఘం నాయకులు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయంలో నిషేధిత వలలతో చేపలు పడుతున్నారని నందికొండ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే రమణ బుధవారం ఆంధ్రా మత్స్యకారులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆంధ్రామత్స్యకారులు తెలంగాణ ప్రాంతంలోకి చొరబడి నిషేధిత రింగు, అలివి వలలను వినియోగిస్తూ చేపలు పడుతున్నారని వాపోయారు. చిన్న కన్నాలు గల ఆ వలలతో చేప పిల్లలను పడుతుండడంతో స్థానిక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయే ప్రమాదముందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మత్స్యకారులు కందాల తాతారావు, పుష్పాటి అప్పలరాజు, విజయ్, యేసు శ్రీను తదితరులు ఉన్నారు.

తల్లిని హత్య చేసిన కుమారుడు

- మద్యం మత్తులో ఘాతుకం
- అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం

అనంతగిరి : అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి తల్లి గొంతు నులిమి హత్య చేశాడు. ఆలస్యంగా బుధవారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన రాములమ్మ (70)కు ఇద్దరు కుమారులతో పాటు కూతురు సంతానం .రెండు సంవత్సరాలుగా ఈమె పెద్ద కుమారుడు కోదాడలో, రెండో కుమారుడు పుట్టబంతి వీరేశం తమ్మరబండపాలెంలో కుటుంబాలతో కలిసి నివసిస్తున్నారు. మేస్త్రీ పని చేసుకుంటున్న వీరేశం కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి భార్య శిరీషను మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో పిల్లలతో కలిసి ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో రాములు గ్రామంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. పెద్దకుమారుడి వద్ద ఉంటున్న తల్లి రాములమ్మ వంట చేసి పెట్టేందుకు ఈ నెల 6వ తేదీన చిన్నకుమారుడు వీరేశం ఇంటికి వచ్చింది. అదే రోజు రాత్రి పూట పూటుగా మద్యం తాగి వీరేశం ఇంటికి వచ్చాడు. ఆ మత్తులోనే తల్లి రాములమ్మ (70)తో గొడవపడి గొంతు నులిమి హత్య చేశాడు. బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఎం.అనిల్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కూతురు రమణ భర్త మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మిడిసినమెట్ల కృష్ణయ్య (51) మంగళవారం పని నిమిత్తం బైక్‌పై నేరేడుచర్లకు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎల్బీ నగర్ ఎస్ఎస్పీ కెనాల్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మిర్యాలగూడలోని బాలాజీ నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ రవీందర్ రెడ్డి, తదితరులు

త్రిపురారం : విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. త్రిపురారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురారం సబ్ స్టేషన్ 33 –11 కేవీ నుంచి నిడమనూరు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిమిత్తం ముకుందాపురం ఫీడర్ ఉంది. అయితే ఈ ఫీడర్‌కు కొన్ని రోజుల నుంచి ఆన్ ఆఫ్ స్విచ్ వద్ద మంటలు చెలరేగుతూ కరెంటు ట్రిప్ అవుతోంది.దానికి మరమ్మతులు చేసేందుకు నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ ముడి నాగయ్య, అదే మండలంలోని జువ్విచెట్టు తండాకు చెందిన కరెంటు మీటర్ రీడర్ సపావత్ అశోక్ వచ్చారు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో నాగయ్య, అశోక్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. అయితే మరమత్తులు చేస్తున్న సమయంలో సబ్ స్టేషన్‌లో అవుట్ గోయింగ్ ఆఫ్‌లో ఉన్నప్పటికీ ప్రమాదవశాత్తు ఇన్‌కమింగ్ లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఇన్‌కమింగ్ తీగ తగిలి ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని ఏఈ రవీందర్ రెడ్డి పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సమయంలో ఎల్‌సీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన త్రిపురారం సబ్ స్టేషన్ ఆపరేటర్ శ్రీనివాస్ రావుపై జూనియర్ లైన్‌మన్ ముడి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు.

మహిళకు గాయాలు

బీబీనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బీబీనగర్ మండలంలోని రహీమ్‌ఖాన్‌గూడెం సమీపంలో చోటు చేసుకుంది. గుర్తుతెలియని మతిస్థిమితం కోల్పోయిన మహిళ బుధవారం రాత్రి రహదారి గుండా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. అదే సమయంలో రహదారి గుండా వస్తున్న కానిస్టేబుల్స్ శ్రీకాంత్, నరేష్‌లు గాయపడిన ఆ మహిళను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తల్లీకుమారుడిపై దాడి

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

కోదాడరూరల్ : కాల్వకట్ట వెంట మేకలు మేపుతున్న తల్లీకుమారుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కోదాడ మండల పరిధి చిమిర్యాలకు చెందిన అల్లిక లక్ష్మి తన కుమారుడు సంతోష్‌కుమార్‌తో కలిసి గ్రామశివారులో కాలవకట్టపై మేకలు మేపుతున్నారు. ఈ సమయంలో గోండ్రియాలకు చెందిన పక్కపొలం వ్యక్తి గార్లపాటి శంకరయ్య ఆయన కుమారుడు గోపిలు తమ పొలంలో మేకలు మేపుతున్నారని కర్రలతో దాడి చేశారని బాధితురాలు వాపోయింది. ఈ దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. తమపై దాడి చేసిన శంకరయ్య, గోపిలపై చర్యలు తీసుకోవాలని లక్ష్మి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

భువనగిరి రూరల్ : కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వడపర్తి గ్రామానికి చెందిన కాసాని పాండు భువనగిరిలోని ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని నాలుగేళ్ల కుమారుడు ప్రణయ్ ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా వీధి కుక్కలు ఒక్కసారిగా విరుచుపడి దాడి చేశాయి. గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు తొలుత భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నిర్మానుష్యంగా హాస్టల్

- వసతి గృహాన్ని ఖాళీచేసి ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థినులు

భువనగిరి క్రైం : భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య అనంతరం అందులో ఉన్న మిగతా విద్యార్థినులు హాస్టల్ విడిచి సొంత గృహాలకు వెళ్లిపోయారు. ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న ఈ హాస్టల్‌కు రక్షణ చర్యలు ఏమీ లేవు. గతంలో కొంతమంది వ్యక్తులు హాస్టల్ పరిసర ప్రాంతాల్లోని కాలనీలో గంజాయి సేవిస్తుండగా పోలీసులు వారిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి. హాస్టల్ భవనం బాలికలకు అనుకూలంగా లేదు. కాగా, హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న సుశీల, ఆటో డ్రైవర్ ఆంజనేయులు ప్రవర్తనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బాలికలను హాస్టల్ వార్డెన్ బయటికి తీసుకువెళ్లేదని, ఆటో డ్రైవర్ కూడా విద్యార్థులను తీసుకుపోయి హోటళ్లలో తినిపించేవాడని తెలుస్తోంది. అలాగే విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా.. తమ కూతుళ్లకు డబ్బులు అవసరం ఉంటే ఆటో డ్రైవర్ ఫోన్‌పే, గూగుల్‌పేకు పంపించేవారని తెలిసింది. పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపడితే నిజానిజాలు బయటికి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

దర్యాప్తు పారదర్శకంగా జరుగుతోంది..

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య సంఘటనలో పుకార్లను నమ్మవద్దని, దర్యాప్తు పారదర్శకంగా కొనసాగుతోందని భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర చెప్పారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిందని, విద్యార్థినుల వంటిపై గాయాలేమీ లేవన్నారు. ఇంతవరకు గదిని పరిశీలించి మిగతా అమ్మాయిలను విచారించి రికార్డు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, తమ దగ్గర పూర్తి సమాచారం ఉందని, కొన్ని నివేదికలు బహిర్గతం కాకుండా కోర్టుకు నేరుగా సీల్డ్ కవర్‌లోనే పంపించాల్సి ఉంటుందని చెప్పారు. కొన్ని సున్నితమైన విషయాలను ప్రజల్లో మాట్లాడడం మంచిదికాదన్నారు. హాస్టల్‌లోని బాలికలు భయపడాల్సిన అవసరం లేదని, వెంటనే హాస్టల్‌లో వచ్చి ఉండాలని సూచించారు. సుసైడ్ నోట్‌ను సీజ్ చేసి ఫోరెన్సిక్ నిపుణులకు పంపామని, రిపోర్టు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

మిత్ర పురుగులతో పంటకు మేలు

- వరి సస్యరక్షణలో మిత్ర పురుగుల పాత్ర కీలకం
- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్

పాడి పంట

పెద్దవూర: వరి సస్యరక్షణలో మిత్ర పురుగుల పాత్ర ఎంతో కీలకమని వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. వీటితో పంటలకు మేలు చేకూరుతుందని, ఇవి చీడపీడల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. ఈ పురుగుల గురించి రైతులు తెలుసుకుంటే క్రిమి సంహారక మందులు వాడే బెడద ఉండదని, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందవచ్చునని పేర్కొన్నారు.



మేలు ఇలా..

- దాదాపు ఇరవై వేల గుడ్లు ఉన్న ట్రైకోకార్డును ఎనిమిది లేదా పదహారు సమభాగాలుగా చేసి ఎకరా పొలంలో అక్కడక్కడా ఎండ తగలకుండా ఆకు అడుగు బాగంలో పిన్ చేయాలి. ఈ విధంగా ట్రైకోకార్డులను వాడే వారం రోజుల ముందు, తర్వాత వారం రోజుల వరకు ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదు. వరినాట్లు వేసిన వారం రోజుల తర్వాత పది రోజుల వ్యవధిలో మూడు లేదా నాలుగు సార్లు వదిలితే కాండం తొలుచు పురుగులను నివారించవచ్చును.
- టెమిలుక, ఫినోరోటామా జాతికి చెందిన పరాన్న జీవులు కూడా కాండం తొలుచు పురుగులను లార్వాను, కొశస్థ దశలను చంపివేస్తాయి.
- పరాన్న జీవులు లేదా బదనికలుగా ఎనిమిది రకాల సాలే పురుగులు వరి పంటపై నివశిస్తాయి. ఇవి అనేక ఆకృతులు, రంగుల్లో ఉంటాయి. ఇవి సుడిదోమలు, తెల్లమచ్చ దోమలు, పచ్చదీపపు పురుగులు, ఆకుముడత, గొట్టపురుగులను తింటాయి.
- నీటి నల్లులు నీటిలో నివశిస్తాయి. ఇవి సుడిదోమలు, దీపపు పురుగులను తింటాయి.
- మిరిడ్ నల్లులు లేత ఆకుపచ్చ రంగులో పొడవైన స్పర్శకాలను కలిగిఉంటాయి. ఇవి సుడిదోమలు, దీపపు పురుగులను తింటాయి.
- పెంకు పురుగులు వివిధ రకాల లద్దె పరుగులు, కాండం తొలుచు పురుగులను తింటాయి.
- వాటర్ స్పైడర్స్ నీటిపైన తేలియాడుతూ సుడిదోమ, చిన్న గొంగళి పురుగులను తింటాయి.
- గొల్లభామలు రైతులకు బాగా ఉపయోగపడతాయి. రసం పీల్చే పురుగులు, ఇతర చీడ పురుగులను తింటాయి.
- తూనీగలు సుడిదోమలు, దీపపు పురుగులు, గొట్టపు పురుగులను తింటాయి.
- అల్లిక రెక్కల పురుగులు పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, తొలి దశలో ఉన్న లద్దె పురుగులను తింటాయి.
- చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటే మాత్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసు మేరకు రసాయన మందులను పిచికారీ చేయాలని ఆయన సూచించారు.


తూనీగ


సాలెపురుగు


గొల్లభామ

మూడు దశల్లో విస్తరణ

పరాన్న జీవులు మూడు దశల్లో ఆశించి పురుగులను నాశనం చేస్తాయి.

- గుడ్ల దశలో ట్రైకోగామా ఖిలోనిస్, ట్రైకోగామా జపానికం, టెలినోమస్, లార్వా దశలో ఆపాంటిలిస్, టెమిలుక, ఇలాస్మస్, కోశస్థ దశలో జంథోపింప్లా, బ్రాచిమెరియా, గోనియాజస్ మొదలైనవి ఉంటాయి.
- ట్రైకోగామా, టెలినోమస్, టెట్రానికస్ జాతికి చెందినవి గుడ్డు దశలో పరాన్నజీవులు, కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగులు పెట్టిన గుడ్లను ఆశిస్తాయి. గుడ్డు దశలోనే 50 శాతం వరకు కాండం తొలుచు పురుగుల ఉధృతిని తగ్గిస్తాయి. ట్రైకోగామా పురుగులను పొలంలోనే కృత్రిమంగా విడుదల చేసి అతి తక్కువ ఖర్చుతో శత్రు పురుగుల సంఖ్య పెరగకుండా నియంత్రించ వచ్చును.